# సృష్టి

— తాడిగిరి పోతరాజు

రోహిణీ కార్తె జరిగిపోయి చానాళ్ళయినా ఇంతవరకూ చినుకులేదు. సూర్యుడు ఇంకా నిప్పులు చెరిగిపోస్తున్నాడు. పొలాలన్నీ నెర్రెలుబారి వాన చినుకు కోసం నోళ్లుతెరచుకొని ఉన్నాయి. పశువులన్నీ డొక్కలు అంటుకుపోయి ఈసురో మంటూ నేలను నాకుతూ బీళ్ళలో తిరుగుతున్నాయి.

ఇక ఊళ్ళో నీటి ఎద్దడి చూద్దామా మరింత అధ్వాన్నంగా ఉంది. నాల్గు నెలలనాడు ఒట్టిపోయిన మంచినీళ్ళ బావులు రెండూ చెత్త చెదారంతో నిండిపోతున్నాయి. ఆమడ దూరంలోవున్న చెరువులో చెలమలు త్రవ్వకొని బురదనీళ్ల తేర్చుకొని త్రాగుతున్నారు. ఊరంతా కూలీనాలీ చేసుకొనే అలగా జనం పనులులేక తిండికి మలమల మాడిపోతున్నారు.

నాల్గురోజుల నుండి మబ్బులు చేస్తున్నాయి ఫెళఫెళమనీ ఉరుములు ఉరుముతున్నాయి, కానీ వానమాత్రం ఊరిమీద వంగటంలేదు. ఊళ్ళో ఆడంగులంతా బుగ్గలు నొక్కుకొన్నారు చోద్యంగా. వృద్ధులు నొసటిపై చెయ్యి అడ్డం పెట్టుకొని పెదవి విరుచుకొన్నారు నిరాశగా.

.... .... ఆవేళ మంచినీళ్ల చెరువు కట్టపై ఊళ్ళో పెద్దతలలనుకొనే పది మందీ ఆ సమస్యా పరిష్కారానికై సమావేశమయ్యారు. కుర్రకారు వినయంగా చేతులు కట్టుకొని పెద్దలవెనుక నిలబడ్డారు.

"కలికాలం .... .... పాపం పెరిగిపోయింది. ఊళ్ళో దేవుడు - దెయ్యం అనే భయం భక్తి ఉంటేనా? ........ఊరు నాశనానికొచ్చింది ........కానివ్వండి..." రుసరుసలాడుతూ బంగారపు మురుగులు పైకి త్రోసుకొంటూ ఊరిపెద్ద చిన్నపరెడ్డి సమావేశం ప్రారంభించారు.

"రాత్రి రేడియోలో చెప్పింది. అదేదో పట్నంలో కూడ నీళ్ళెద్దడి...." అని "అవునవును.... బొంబాయిలో కూడ తాగటానికి నీరులేక జనం నానా ఇబ్బంది

604

పడిపోతున్నారంట. ఇక వానకోసం.... నిన్నటినుండి పెద్ద పెద్ద వాళ్ళందరూ కూడ బలుక్కుని వానదేవునికి పూజలు సేపిత్తున్నారంట. ఒక్క మనూళ్లోనేకాదు దేశమంతటా పాపం పెరిగిపోయింది "

"పాపమా?.... పాపమా?".... ఏనాడయినా అమ్మిందా ఏరుశెనక్కాయ నూనె తొమ్మిది రూపాయలు?.... దరిద్రపు బుద్దులు.... నాశనానికి కాకపోతే...."

"అదిసరే.... ఇప్పుడు మనం కూడ పూజలు జరిపియాల్సిందే నంటారా— ....అదేదో తేలవండి." ఓ నడికారు పెద్దమనిషి ప్రశ్నించాడు.

"జరిపియాల్సిందేనంటారా?" అని మెల్లిగా అడుగుతాడేరా?.... కొలుపులు కొలవాలి.... ఊరిబయట పోలేరమ్మతల్లి గుడికాడికి పోయి ఎన్నాళ్ళయిందో ఏందో, ఒక దీపారాజన లేదు.... అలనా పాలనా లేదు.... ఆమె మాట మరిసిపోయినప్పుడు మన సంగతి ఆమె కెందుకు?" ....చుట్ట కాల్చుకొంటూ దీర్ఘంగా అన్నాడు చిన్నపరెడ్డి

"అవును బావా!.... పాపం బాగా పెరిగిపోయింది.... ఈ ఎదవ సినిమా లొచ్చినాయి.... ఆడముండలు మరీ బరితెగించిపోతున్నారు.... మన కాలంలో ఆడది గడపదాటి ఎరుగదు.. ఇక యిప్పటివాళ్లా? ఒకటే ఇకఇకలు- పకపకలు.... ఎక్కడ సూసినా సినిమా ముచ్చట్లు— సిగ్గూ— ఎగ్గూ లేకుండా ... సినిమాల కెళ్ళడం ... సోకు సేసుకోవటం.... పట్టపగ్గాలు లేకుండా పోతున్నాయి".... యువతరం ఆడవాళ్ళపై తనకున్న అక్కసునంతా వెళ్ళగక్కాడు ఓ పెద్దమనిషి, అవకాశం చూసుకొని.

"ఇంతకూ ఇప్పుడేం సేద్దాం?"

"ఏంసేద్దా మేమిటి? తల్లి కోర్కెలు తీర్చాలి.... మొక్కులు మొక్కాలి ... అప్పుడే వాన బడుద్ది" ...

"ఇంకేం ఇంటికొక కోడిపుంజు ... కులానికొక దున్నపోతుగానీ ... మేక పోతునుగానీ ఇడుద్దాం తల్లిపేరట"....

ఆ ప్రతిపాదన ఏకగ్రీవంగా ఆమోదించ బడింది. అందరి ముఖాల్లోనూ సంతృప్తి. విపరీతంగా పెరిగిపోయిన పాపానికి పరిహారార్థమై పోలేరమ్మ తల్లికి చెల్లించవలసిన మేకపోతులు— దున్నపోతులు— కోడిపుంజుల లెక్క తేలిపోయింది. పదిహేను రోజులవరకూ కొలుపులు కొలవాలి, నిర్ణయమైంది. ఆరోజు మొదలుకొని.

దాదాపు నెలరోజుల నుండి ముడిపడి కూర్చున్న సమస్య విడిపోయిన మబ్బులా కనిపించింది. కుర్రకారు బిలబిలమంటూ కదలసాగారు. అందరి ముఖా

605

ల్లోనూ ఉత్సాహం పొంగి పొర్లసాగింది. అనుకున్నదే తడవుగా పోలేరమ్మతల్లి గుడిని దర్శించటానికీ, అభిషేకించటానికీ సన్నాహాలు జరిగిపొయ్యాయి.

ఆ సాయంత్రం మూడు గంటలకు 'పంబలవాళ్ళు' డోళ్లు బూరాలూ చేత బట్టారు: 'కీం-కీం' అని డోలుపై గీరుతుంటే ఒళ్లు గగుర్పొడచ సాగింది. సింహ నాదం పైకెత్తి ఊరు ప్రతిధ్వనించేలా నాల్గుపైపులా తిప్పి ఊదుతూంటే [ఒక్కొక్క రిలో] ఏదో కొత్త ఉన్మాదం ఆవహించసాగింది. గాలిలో తిరిగే గడుసు దయ్యాలు ముసురుకొంటూన్న అనుభూతి.

కుర్రవాళ్ళందరూ ఉత్సాహంగా కావిళ్లు భుజానవేసుకొని, బావులవైపు పరు గెత్తారు. ఉరకలు పరుగులపై కావిళ్లు నింపుకొని, రెండు జట్లుగా నిలబడిపొయ్యారు. గరుడుగుడ్డ నాల్గుమూలలాబట్టి నల్గురు నిలబడ్డారు. మధ్యలో చిన్నగడతో దాన్ని గొడు గులా లేపి నిలబడ్డాడు ఊళ్లో నాల్గుతరాలు చూసిన పెద్దమనిషి. ఆతని సరసనే నిల బడింది ఊళ్లో పెద్దముత్తయిదు. తలంటి స్నానంచేసి నొసట రూపాయంత కుంకమ బొట్టు దిద్ది, పసుపుబట్టలు చుట్టుకొని హారతిపళ్లెం పట్టుకొంది. పసుపు- కుంకుమ- పూలు- బుక్కాలు- కొబ్బరికాయల మధ్య కాలుతున్న అగరువత్తులు. ఆమె చెంతనే నిప్పు కణికలున్న కుంపటి, పంబలవాళ్లు, సాంబ్రాణి చల్లినప్పుడల్లా గుప్పున పొగలేచి వాసనలు, మత్తెక్కించ సాగాయి.

డోళ్ళు- సన్నాయిలూ తారస్థాయికి వెళ్ళి- 'కీం - కీం' అనే భయంకర సంగీతం వినిపిస్తున్నాయి. పెచ్చచేసిన కనకతప్పెటలు లయబద్ధంగా ఊరేగింపుకు దారి చూపుతున్నాయి. దాదాపు రెండుపందల నీళ్ళకావిళ్లు 'గరుడు'గుడ్డ వెనుక నిలబడి పొయ్యాయి, శ్రవణేంద్రియాలు పగిలిపొయ్యేలా చేస్తున్న ఆకోలాహలంలో ఒకరితో మరొకరు మాట్లాడటానికి వీలులేక, సైగలు చేసుకొంటూ, హడావుడిగా తిరుగుతు న్నారు. అమ్మవారి గుడికెళ్ళటానికి అన్ని తతంగాలూ పూర్తయ్యాయి.

అందరి ముఖాల్లోనూ ఒక్క క్షణికకాలం ఏదో అవ్యక్తమైన వెలితి కంపిం చింది. ప్రోగైన జనాన్ని పరీక్షగా అవలోకించసాగారు పెద్దలు. ఊరు ఊరంతా కదిలి తల్లిని తలచుకొన్నప్పటికీ ఆమెకింకా అనుగ్రహం కలుగలేదు. ఎవరిని ఆవేశిం చటం లేదు. "తల్లిపూనింది- పూనింద"ని కేకలు—

జనం తొక్కిసలాట. జన సమూహంలో- అంతలో సమూహంలో నుండి ఒకవ్యక్తి దూసుకొచ్చాడు. పచ్చివేపాకు మండలు కసిగా నములుతూ వెనక్కీ ముందుకూ ఊగిపోసాగాడు. అందరి ముఖాల్లోనూ ఆనందం తళుక్కున మెరిసింది.

సాంబ్రాణిధూపం ఎక్కువైంది. తప్పెటలు తారాస్థాయికి వెళ్ళిపొయ్యాయి. సింహనాదాలు హర్షధ్వానాలు చేశాయి. అతని తలపై కడవలతో నీళ్లు కుమ్మరించి మరింత పవిత్రంచేశారు. నీరుకారుతూన్న శరీరంతో మరింత ఊగిపోతూ కళ్ళుమూసి కొని వేపాకు కసిగా నమిలి వెళ్ళగక్కసాగాడు.

తప్పెటలపై దరువు పరసమారింది. చిందులు తొక్కుతూ డప్పులవాళ్లు ముందుకు కదిలారు. వాళ్ళవెనుక పెద్ద ప్రవాహంలా పూరంతా పోలేరమ్మ గుడివద్దకు కదిలిపోయింది.

శంఖు ఆకారంలోవున్న గుడి - గుడిచుట్టూ నానాచెత్త చెదారం వెల్లవేయక పోవటం వలవ పచ్చగా నల్లగా పాకుడుపట్టి అసహ్యంగావుంది. రివ్వున ఒకడు గుడి పైకి ప్రాకాడు. అందరూ కడవలతో నీళ్లందించారు— ఏకధాంగా గుడిపై నీటిని కుమ్మరించసాగారు. బావులన్నిటినీ వూడ్చిపారేసి తెచ్చిన ఉప్పునీళ్లన్నిటినీ గుడిపై దిగపార బోసి మొదటి అంశం పూర్తిచేశారు.

కీర్రున గది తలపులు వెనక్కి వెళ్ళిపొయ్యాయి.

గబ్బిలాల కంపు- ఉడతలు- తొండలు- చిమ్మెటలు- విసర్జించిన మల మూత్రాదుల మాగుడు వాసనలు గప్పునలేచి ముసురుకోసాగాయి. అంతా చీకటి- కిటికీలులేని పోలేరమ్మ నివాసం, పెద్దలందరి కళ్లూ పొడుచుకొని చూశాయి మారుమూల ల్లోకి తల్లికోసం. ఆమె అదృశ్యమైంది,

గుడి నడిబొడ్డుమీద ప్రతిష్టించబడిన పోలేరమ్మ విచిత్రంగా మాయమైంది. ఆమె ఎప్పుడు ఎలా అదృశ్యమైందీ ఏ మానవుడికీ తెలియదు. అందరూ ముక్కుమీద వేలు వేసికొన్నారు.

తల్లికి తీరని అపచారం జరిగిందనే భావం అందరి ముఖాల్లోనూ ప్రస్ఫుటమైంది.

"నన్ను మరిచిపొయ్యారు మీరు"…. వెనుకకూ ముందుకూ వూగిపోసాగాడు గణం పెరిగినవ్యక్తి. నిప్పుకణికలపై సాంబ్రాణి గుప్పెళ్లగుప్పెళ్లగా కుమ్మసాగారు.

607

మేఘంలా లేచిన ధూపం.

ధూపంలో వూగిపోతూన్న తల.

"శరణు- శరణు తల్లీ" లెంపలు వాయించుకొన్నాడు కథానాయకుడు. "నాకు మేకపోతులు కావాలి .. కోడిపుంజులు కావాలి.... నా ఆకలి తీరటంలేదు .. నాకు ఆహారంలేక ఏళ్ళు గడిచిపోయినయి".... నురగదుబ్బల వేపాకు పెదవులవెంట కార్చుకోసాగాడు.

"అపచారమైంది తల్లి . శరణు .. శరణు.... నీకోర్కెలన్నీ తీర్చుతాం ... పల్లగాసూడు తల్లీ".... ఒక్క దెబ్బతో కొబ్బరికాయ పగలకొట్టి గణాచారి చుట్టూతిప్పి విసిరిపారేశాడు.

"ఆకలివేసి నేను వూరు ఇడిసిపొయ్యా ... నన్ను మరసిపొయ్యారు మీరు నా ఆకలి తీరవలేదు మీరు".... వూగుతున్న శరీరం బోరగిలాపడింది. పడిన శరీరంపై కడవలతో నీళ్ళు.

తల్లి ఆ నోటివెంట పలికిన సత్యం అందరి తలలోకి ప్రాకినది. డోళ్ళు దప్పులూ ఆగిపొయ్యాయి. సింహనాదాలు, కొమ్ముబూరలూ భుజాలెక్కాయి వాన కురిశాక కనిపించే వెలిమబ్బులా ప్రశాంతత.

తల్లికి ఆగ్రహం కల్గి నిష్క్రమించినందుకు అందరూ ముఖాలు వేలాడవేసికొన్నారు. ఆమె పునః ప్రతిష్ఠాపనను గూర్చి సమాలోచనలు ప్రారంభమయ్యాయి. విగ్రహం చెక్కించి ఆలయపు నడిబొడ్డుపై ప్రతిష్ఠించాలి అది తక్షణ కర్తవ్యం— అయితే పోలేరమ్మ మూర్తిని రాతినుండి మలచటమా లేక చెక్కనుండి తొలచటమూ అనే సమస్య ఉత్పన్నమైంది. శిలనుండి శిల్పాన్ని చెక్కటానికి చెయ్యి తిరిగిన శిల్పి కావాలి. అతనికీ కొన్ని నెలలయినా గడువివ్వాలి, పెదవులు చప్పరించారు

అందరి దృష్టి గుడిముందు జడలు విరబోసికొన్న ముసలి వేపచెట్టుపైకి ప్రాకింది. తల్లికి ప్రీతికరమైన చెట్టు- ప్రమానుచుట్టూ పసుపు- కుంకుమ,

దక్షిణ దిశగా గుడిపైకి ప్రాకిపోయిన పెద్దకొమ్మలను నరికి అందులోనుండి పోలేరమ్మను సృష్టించటం సబబనిపించింది. పదిహేను రోజుల్లో పోలేరమ్మమూర్తి తయారు కావటానికి అంతకన్న వేరేమార్గం కనిపించలేదు పెద్దలకు. అయితే వేప మొద్దునుండి తల్లిని తయారుచేయగల చెయ్యితిరిగిన వడ్రింగి ఎవరా అని తలలుపట్టుకొని కూర్చున్నారు. వారి దృష్టిపథంలో ఎవరూ తగలలేదు.

608

'ఆఁ.... వాడు— పల్లెలో వీరాయ్ రెండో కొడుకు.... వాడుతప్ప నాకెవరూ గుర్తు తగలటంలేదు' ... ఒక పెద్దమనిషి సలహా ఇచ్చాడు.

'అదే— వాడు మిలిటరిలోకి పొయ్యొచ్చాడు కదా? నాకూ వానిమీదే వుంది. ఇందాకట్నుంచి వాడిసేత మొన్న మా పడమటీధి భవంతిదర్వాజా చేపిచ్చా .. గుర్రాలు గిరాళ్లు ప్రాణంతో ఉన్నట్టే ఉన్నాయి ... కాని వాడిసేత తల్లిని సేపిద్దామా?'.... సందేహాస్పదంగా అందరి ముఖాల్లోకి చూశాడు చిన్నపరెడ్డి.

"కులం తక్కువోడనేగా నీ అనుమానం.... తక్కువో ఎక్కువో మరేం సేద్దాం— అంతకన్న వేరేదారి లేనప్పుడు"....

"అపశార మవుతుందేమో?"

'ఇక అపశారమో గిపశారమో.... వాడు తప్పితే మనకు ఏరే వడ్రంగపు పనివాడు దొరకడు.... దొరికినా ఇంత తొందరలో మనకు తల్లిని సేసియ్యలేడు ... పోతే అపశారం జరుగుతుంది. మైలపడకుండ ఏదైనా ఉపాయం ఆలోసించాల్సిన పని సిద్ధాంతికి వదిలేద్దాం' ...అంటూ కళ్ళు శాస్త్రిలగారికేసి తిప్పాడు.

శాస్త్రిలు ఆలోచనను వ్యక్తపరుస్తూ కళ్ళు ఆకాశంకేసి వేపచెట్టుకేసి తిప్పు కొన్నాడు. జంధ్యంతో వీపు రుద్దుకొన్నాడు చిటికెడు ముక్కుపొడుం నసాళానికి అంటించి, విభూతి పూసుకొన్న నొసలు చిట్లించి కనుబొమలు పైకెగురవేశాడు.

'పోలేరమ్మ క్షుద్రదేవత— స్పృశ్యులు- అస్పృశ్యులు అనే తారతమ్యం అంతగా పాటంచదు— అయినా వేదాల్లోచెప్పినట్లు ఆమెను సృష్టించిన వాడెవడయినా కావచ్చు' కాని ఆ మూర్తికి చూపు ప్రసాదించినప్పుడే ఈసమస్య ఉత్పన్నమౌతుంది. ఆమెకు అపచారం కలుగకుండ— శుభ్రింగా స్నానం చేయించి మైలతుడిచి, నా చేతుల్తో చూపు కలిగిస్తాను— వేదోక్తంగా తల్లికి చూపుకల్గించి ప్రతిష్ఠించుతాను'— సున్నితంగా చేతులు తిప్పుతూ ఉపన్యసించసాగాడు.

అందరి ముఖాల్లోనూ ఉత్సాహం అలుముకపోయింది గచ్చుమీదబడ్డ కిరస నాయిల్లా. మాటా పలుకూలేకుండ సిద్ధాంతికేసి చూడసాగారు వాళ్లు. ఆ అస్పృశ్యు లందరికీ దూరంగా ఒక బండపై బాచిపీటవేసి కూర్చున్న ఆ సిద్ధాంతి చిరునవ్వుతో అందర్నీ పరామర్శిస్తూ సమస్యకు పరిష్కారమార్గం చూపెట్టాడు.

జన్మ తరించినట్లు, వెర్రి ఆనందంలో అందరూ ఆ అపరదైవానికి చేతులెత్తి నమస్కరించారు.

609

పోలేరమ్మ తల్లికి అత్యంత ప్రీతికరమైన వేపచెట్టు కొమ్మతెగి నేలపడిపోయింది. ముళ్లు- పగుళ్ళు- పుచ్చు- చిచ్చులేని అతిశ్రేష్ఠమైన చేవకల్గిన రెండుగజాల పొడవున్న మొద్దు తీర్మానం ప్రకారం వీరాయ్‌కొడుకు ఇంటికి చేరింది. పదిరోజుల్లో ఆ మొద్దునుండి తల్లి ప్రత్యక్షం కావాలని అతన్ని శాసించారు. తల్లిని తొలచినందుకు ప్రతిఫలం రెండుబస్తాల వడ్లు, పసుపు కుంకుమ తాంబూలం, పంచెలసాపు. అన్ని లాంఛనాలు ఇవ్వటానికి ఒప్పుకొంది పోలేరమ్మ కమిటీ.

కమిటీ ఒక ముఖ్యవిషయమై పదేపదే హెచ్చరించింది- 'చూపు తనుపెట్ట కూడదని' మౌనముద్రితో ఆ ఒప్పందంపై ఆమోద ముద్రవేశాడు మిలిటరీకి పోయి వచ్చిన వీరాయ్ కొడుకు.

పదిహేను రోజులు కాలవులు సాగిపొయ్యాయి భయంకరంగా, రోజుకొక ప్రాణితల, గున్నపోతుగానీ, మేకపోతుగానీ, కోడిపుంజుగానీ తెగిపోయింది. శిరస్సు తెగిన ప్రాణి విలవిలలాడుతూ నేలపడి నాల్గుకాళ్ళు కొట్టుకొని రక్తపు మడుగులో ప్రాణం విడిచేది. వేపమండలు కట్టి పసుపు కుంకుమలు దిద్ది పవిత్రంచేసిన కుంపటిని రక్తంతో నింపి తెగిపడిన శిరస్సును ఆ రక్తంలో పేర్చి కుంపటిని శివంబూనిన ఒక 'పంబలవాడి' తలపైకెత్తి వూరు మాటుమణిగిన తరువాత వూరి వీధులన్నీతిప్పి వూరుని పవిత్రం చెయ్యసాగారు,

భయంకరమైన అరుపులతో కేకలతో ఒళ్లు జలదరించే డప్పుతో, మేళాలతో రాత్రిళ్ళు ఈ భీభత్సకాండ నిర్విఘ్నంగా కొనసాగింది ఒకవైపు.

వీరాయ్ కొడుకు చేతుల్లో వాడి బాడిస, ఉలిదెబ్బల క్రింద వేపమొద్దులో నుండి కొద్దికొద్దిగా తొంగిచూడ సాగింది పోలేరమ్మ మరోవైపు.

ముందు తలభాగంతో ప్రారంభమైన పోలేరమ్మ గిర్రున పదిహేనురోజులు తిరిగేటప్పటికి కాళ్ళు- చేతులూ అన్నీ సంతరించుకొని భేషుగ్గా కూర్చుంది వూరికి ఎడంగానున్న గుడిశెల మధ్య. తల్లిని చూడటంకోసం వూరి పెద్దలంతా వీరాయ్‌కొడుకు ఇంటికి తరలివెళ్లారు పదిహేనవరోజు ఉదయం, పసుపు పూసికొన్న పోలేరమ్మను ఇద్దరు కుర్రాళ్లు ఆ ఇంటిబైటకు మోసికొచ్చారు. పదిమంది పెద్దలూ విగ్రహం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ పరిశీలించసాగారు.

"అంతా బాగానేవుంది కాని ఈచెయ్యి కొద్దిగా జారినట్టనిపిత్తంది- నాకు మట్టుకు- ఏది కొద్దిగా ఎడంగా పొయ్యి సూడనివ్వండి- దూరంగా నుండి చూసినా

610

అట్టా అనిపిత్తుందా? ఏది రామయ్య బావా? నీవుసూడు"— నఖశిఖ పర్యంతం పరిశీలించిన చిన్నపరెడ్డి అన్నాడు.

"నాకు మాత్రిం సీతన్న ఎక్కువేం తెలుసు"— అంటూ నాల్గడుగులు వెనక్కూ ముందుకూ వేసి— "నాకుకూడ అట్టానే అనిపిత్తుంది బావా?" అన్నాడా తల పాగా చుట్టిన పెద్దమనిషి.

'పరీచ్చగా సూత్తే అట్లానే అనిపిత్తుంది'— నాల్గయిదు కంఠాలు వంతపలికాయి వీరాయ్ కొడుకుకేసి చూస్తూ.

విశాలమైన వక్షస్థలము— మెలితిరిగిపోయిన కండరాలు— రోమన్ సైనికునిలా రెండు చేతులు నడుముపై ఆన్చుకొని ఠీవిగా నిలబడి తన సృష్టికేసి సుదీర్ఘంగా చూస్తున్న అతను పోలేరమ్మకేసి రెండడుగులు వేశాడు.

'ఈ చెయ్యికదూ మీరు సెప్పేది?— అవును అదాటున బాడిసిదెబ్బ తగిలి కొద్దిగా జారింది ఇప్పుడైనా కొంపమునుచుకు పోయిందేముందిలే సరిచేద్దాం' అంటూ 'అమ్మీ— గూటిలో మేకులున్నాయి ఇటు తీసికురా' అని కేకలేశాడు.

మేకులు చేతికందాయి.

'దీనిదేముందిలే— గూడ జారిందంతే'— అంటూ తల్లి భుజం కొద్దిగా పైకెత్తి మేకు పొందికగా పట్టుకొని బాడిస తీసికొని పోలేరమ్మ భుజంపై రెండు చరిచాడు.

'చాలు చాలాగ్రి .... ఇప్పుడిక తల్లికేం వంకర్లు లేవు .... మనం పెందరాళే గుడికాడకు తల్లిని సేరుస్తాం . ఒరేయ్ నీకు రెండు బస్తాల వడ్లు రేపు కొలుత్తా— మా యింటికాడకురా . ఇక మేము నీకిత్తామన్న పంచెలసాపు తాంబూలం మద్దినేల తల్లిముందు ధణ్ణం పెట్టి కట్టుకో... అంతటతో నీకు అపశారముండదు

'సిత్తం .. సిత్తం కానీ గింజలొద్దులెండి...ఏదో తమ దయవలన కూటికి ఇబ్బంది పడటం లేదు. ఏదో నాకు సేతనయినంత మట్టుకు నేను తల్లికి సేశాను.... ఆసూపుకూడ నేనే పెడ్తా'...బాడిస భుజాన వేసుకొని రెండు చేతులెత్తి అందరికీ దణ్ణం పెట్టాడు పారిధేయ పడుతున్న కళ్ళతో.

ఆవతలివాళ్ళకళ్లు ఎర్రబారాయి. కోరచూపులు చూశారు వీరాయ్‌కొడుకుకేసి "బాబుగారూ నాదొకసిన్న మనవి నాకొడుకు ఈపదిహేనురోజులూ తిండితిప్పలూ

611

మానుకొని రేయనక, పవలనక తల్లిని తయారు సేశాడు. ఇకనేనుగానీ నాకులవోళ్ళుగానీ ఈ వూరు పుట్టినప్పటినుండీ డప్పులుకొట్టి బలులు నరికి తల్లికి సేవసేత్తున్నాం .. తల్లి మా కులదైవం .. ఆసూపు కూడా మా వాదే బె డ తా డు ..మీకు దణ్ణం బెడతా'' వీరాయ్ పలికాడు. నిమ్మకాయ నిలిచే గుబురు మీసాలు సొగసుగా ఆడించుకొంటూ, తప్పతాగిన కళ్లు చింతనిప్పులు కక్కుతున్నాయి.

'అరేయ్ వీరాయ్.. అదికానిసంగతి నాసేత పదేపదే సెప్పించుకోమాకండి వాడితో మొన్నకూడాసెప్పా...అసలే తల్లికి కోపమొచ్చిఊరువిడిచి పోయిందని శాస్త్రులు సెబుతానే ఉన్నాడు దానికితోడు ఈడు సూపు బెడితే ఇంకేమన్నా ఉందా? వానలు లేవు సరికదా? ఇంకా అమ్మవారు పొయ్యటం—గత్తర రావటం ఊరంతా ఊడ్చుకపోతది, మళ్ళీ రెండోసారి ఆ కూతకూయగాకండి నా దగ్గర'—బంగారపు మురుగులు పైకి తోసుకొని పొన్నుకర్ర పొడుచుకొంటూ ముసలాడు ముందుకు కదిలాడు—పరివారాన్ని వెంట బెట్టుకొని.

కదిలిపోతున్న వాళ్ళను విస్ఫారిత నేత్రాలతో పరికిస్తూ పళ్లు కొరుక్కోసాగారు వీరాయ్, వీరాయ్ కొడుకు, ఇంకా ఇతర స్వజనం.

పదిహేను రోజులుగా జరిగిపోతూన్న పోలేరమ్మ కొలుపులు ఈవేళ పరాకాష్ఠ నందుకొన్నాయి. విగ్రహ ప్రతిష్ఠాపన- పూజలు- బలులు పట్టినంతపని ఊళ్ళో ప్రతి యింట్లో ఈ హడావుడి కనిపించసాగింది. ఇంటి గడపలు పసుపు కుంకుమ-తో ద్వారాలు వేపమండలతో కళకళలాడుతున్నాయి. ఉదయానే లేచి ఆడవాళ్లు స్నానాలు ముగించుకొని పసుపు బట్టలు ధరించి, కొబ్బరికాయలు, పూలు బుక్కాయి పేర్చిన హారతిపళ్లాలు చేతబట్టి బారులుతీరి పోలేరమ్మ గుడివైపు నడిచారు.

గుడి వెల్లవేసి శుభ్రంగా కళకళలాడుతోంది,

గుడిముందు మండపం, మండపం మధ్యలో కూర్చున్న పోలేరమ్మ. ఆమె కుడిచేతివైపు బారులుతీరిన బలి పశువులు, దున్నపోతులు - మేకపోతులు, పసుపు కుంకుమలు చల్లిన వెన్నులతో, మెడలలో వేలాడుతూన్న వేపమండలతో, తమ అంతిమ క్షణాలను నిరీక్షిస్తూ 'అంబా' మంటూ హృదయ విదారకంగా అరుస్తున్నాయి మోర లెత్తుకొని.

వాటి చెంతనే వాటి శిరస్సులను ఒక్కవేటుతో త్రెంచి పారెయ్యటానికి సన్నద్ధమైన వీరాయ్- అతని అనుచరుడు మరొకడు. ఇద్దరికీ మొలలపైగుడ్డ మినహాయించి ఒంటిపై మరో అచ్ఛాదనలేదు.

612

నల్లని ధృఢమైన శరీరాలు.

తప్పతాగిన ఎర్రని కళ్లు.

గుబురు మీసాలతో విలయ తాండవానికి సన్నద్ధులైన రాక్షసులు. ఇద్దరి చేతుల్లో రెండు పొడుగాటి కత్తులు. తీక్షణమైన సూర్యకాంతితో తళతళలాడుతూ నెత్తురు కోసమని నాలుకలు చాస్తున్నాయి. వాళ్లిద్దరూ నిర్వహించాల్సిన రాక్షస కృత్యాలు నిర్విఘ్నంగా కొనసాగించటానికై ఊతగా శ్రవణేంద్రియాలు పగిలిపొయ్యేలా తప్పెటలు- డోళ్ళు- సింహనాదాలు- కొమ్ముబూరలూ చేస్తూన్న పైశాచిక సంగీతం.

అంతా కోలాహలం.

పశువుల ఆర్తనాదాల మధ్య డప్పులమోతలో జన సమూహపు రద్దీ మధ్య సిద్ధాంతి, రెండవ తరగతి పిల్లవాడు బట్టీపేసిన ఎక్కాలు అప్పచెప్పినట్లు, సూత్రాలు వల్లించసాగాడు- పోలేరమ్మకు ఎదురుగా కూర్చొని.

గాలి స్థంభించిపోయింది.

చెమటతో అందరి శరీరాలు తడిసిపోసాగాయి. నడినెత్తిన సూర్యుడు నకనకలాడిపోతున్నాడు.

పట్టు అంగవస్త్రం పూర్తిగా తడిచిపోయినా అచంచలంగా కూర్చొని ఏకధాటిగా అర్ధగంటసేపు మంత్రాలు పఠించి టపీమని కొబ్బరికాయ కొట్టి తల్లిచుట్టూతిప్పి జనంలోకి విసిరాడు. మరుక్షణంలో ఇంటికొక కావిడిచొప్పున నీళ్ళను పోలేరమ్మపై కుమ్మరించి ఆమెకు సోకిన మైలనుండి పవిత్రించేశారు.

డప్పులు తారస్థాయికి వెళ్ళిపొయ్యాయి

నిప్పుకణికలపై గుప్పెళ్లు గుప్పెళ్ళు సాంబ్రాణి. మత్తెక్కించే పొగలు సెగలు- కరుడుకట్టిన నెత్తురులా కుంకుమరాశి- పటపటమని పగిలిపోతూన్న కొబ్బరికాయలు.

చూస్తూ- చూస్తూ సూర్యుడు మబ్బుల వెనుకకు తప్పుకోవటం మూలంగా మూగ ఎండ కుతకుతలాడి పోసాగింది.

తల్లి పవిత్రమైపోయింది.

డప్పు లాగిపొయ్యాయి- అంతా నిశబ్దం- అందరికళ్లూ సిద్ధాంతిపై కేంద్రీకరించాయి. తల్లికి చూపుకల్గించే కార్యక్రమం కోసమై సన్నాహాలు ప్రారంభించాడు.

పోలేరమ్మ కళ్ళపై నీటుగా పసుపురేఖలు దిద్దాయి అతని చేలివేళ్ళు. తిరిగి కుంకుమ రాశిలోకి వెళ్లాయి.

అంతే!

కుంకుమలో వేళ్లు గుచ్చుకుపోయ్యాయి- నల్లనిపాదం ఒకటి చేతిని తొక్కి-పట్టింది, మరుక్షణంలో ఆ శరీరం అతనిపైకి వంగిపోయింది. సిద్ధాంతి కెవ్వున కేక వేశాడు.

నల్లని చేతులు కుంకుమ అందుకొన్నాయి.

తల్లి పసుపుపచ్చని కళ్ళలో రెండు ఎర్రని కుంకుమ కనుపాపలు దిద్దాయి. నల్లనివేళ్లు పెళపెళమని ఉరుము- గుడిపై నల్లని మబ్బులు.

'వాడిని పట్టుకోండ్రా.... నరకండ్రా.... ఆఖరకు వాడు తల్లికి సూపుపెట్టనే పెట్టాడ్రా" మురుగుల చిన్నపరెడ్డి గొంతు బలిపశువుల మధ్యగా చించుకోసాగింది;

"ఆగక్కడ .... ఒక్కడుగు ముందుకేశావా నీతల అవతల బడ్డద్ది .... ఇయ్యాల తల్లికి నరబలి. ఈ దున్నపోతు తలకాదు.... ముందు నీది.... తరువాత వాళ్లది".... వీరాయ్ గుబురు మీసాలపై మాటలు వంకర తిరుగుతున్నాయి

అతని చేతుల్లో కత్తి- పొడుగాటి కత్తి.

అందరి శిరస్సులపై గాలిలో మిలమిలలాడుతూ తూలిపోసాగింది. ఆకత్తి వెనుక ఇంక పది పన్నెండు కత్తులు.... తప్పతాగిన మచ్చుకత్తులు "దాహం- దాహం" అన్నట్లు నాల్కలు చాస్తున్నాయి.

ఒక్కడుగు ముందుకి ఉరికిన కులపెద్దలు నాల్గడుగులు వెనక్కివేశారు. "ఇదిగో.... ఈ పోలేరమ్మను నేను శేశా.... తల్లికి సూపుపెట్టటంగానీ- బతికియ్యటం గానీ- సంపటంకానీ నాసేతుల్లో పని నాయిట్టం.... ఇదిగో రచ్చించదలచుకొన్న వాడెవడో ముందుకు రండి".... వీరాయ్ కొడుకు గర్జించాడు.

తల్లి మెడపై బాడిసతో ఒకదెబ్బ పడింది.

తెగిన శిరస్సు గుడిమెట్లపై 'దభదభ'మంటూ దొర్లిన శబ్దం. పెళపెళమని ఉరుము- బరువుగా నల్లిగా కదుల్తూన్న మేఘాలు- 'రంయ్ రంయ్' మంటూ పెద్ద తుపాను- ఇంతింతలావు చినుకులు

వాన— భయంకరమైన గాలివాన.

వడగళ్లవాన- రాళ్లు రువ్వుతున్నట్లు భయంకరమైన వడగళ్లు.

వానచినుకు బడగానే ఒళ్లు జలదరించి జనం మధ్యగా పరుగెత్తుతూన్న బలి పశువులు.

వాన- కుంభవృష్టి. నిలబడటానికి వీలులేక అటూఇటూ పరుగెత్తుతూన్న ప్రజల కోలాహలం.

జడివానలో మట్టి కొట్టుకుపోతూన్న పోలేరమ్మ శిరస్సు.

614